# ఒక ఊరి కథ

**కె.ఆర్.కె. మోహన్**

**భా**రంగా వచ్చిన బస్సు అలసిపోయినట్లు గా ఆగింది.

అందులోంచి దిగింది ఒకే ఒక ప్రయాణీకురాలు. ఆమె దగ్గరున్నది కేవలం ఒక్క చేతిసంచీ మాత్రమే. అందులో ఒక చిన్న టిఫిన్ క్యారియర్. బక్కపలుచని ఆమె దిగినందువల్ల బస్సుకి తగ్గిన భారం ఏదీ లేదు. ఉస్సురంటున్నట్లుగా బుస్సుమని శబ్దం చేసి తిరిగి భారంగా సాగిపోయింది బస్సు.

అప్పటికి రాత్రి పది గంటలవుతోంది.

అది పల్లెటూరు. మామూలప్పుడే జనసంచారం తక్కువగా ఉండే ఆ రోడ్డు మీద మాటు మణిగితే పిలిచినా పలికే వాళ్ళుండరు. అటువంటిది - రాత్రి పది గంటల సమయంలో పురుగులు కూడా కదులుతున్నట్లు లేదు.

ఆ పల్లెటూరికి ఆ చింతచెట్టే బస్‌స్టాండ్.

వచ్చేపోయే బస్సులు... అవి పాసింజర్‌వి అయితేనే అక్కడ ఆగుతాయి. ఆ ఆగడం కూడా కండక్టర్ దయ మీద ఆధారపడి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆయనకి ఏదో అర్జంటు పని ఉంటుంది. లేదా అక్కడ ఆపకపోతే మరేమీ కొంపమునగదులే... అనిపిస్తుంది.

అటువంటప్పుడు బస్ ఖాళీ ఉన్నా - బస్ కోసం నిరీక్షిస్తున్న జనం చెట్టుక్రింద నిలబడి ఉన్నా బస్‌ని ఆపమని కండక్టర్ చెప్పడు. కండక్టర్ చెప్పందే లేదా గంట కొట్టందే బస్‌ని ఆపడానికి రూలు ఒప్పుకోదు కనుక డ్రైవర్ జనాన్ని చూసినా చూడనట్లే బస్‌ని తీసుకుపోతుంటాడు.

అదేమని అడిగే అవసరం బస్‌లోని వాళ్ళకుండదు. బస్ కోసం ఎదురుచూస్తున్న వాళ్ళకి అడిగే అవకాశం ఉండదు. ఒకవేళ గొంతు పెగిల్చి అరిచినా జంటకవుల వంటి కండక్టర్, డ్రైవర్‌లకి వినిపించదు. ఇది మామూలుగా జరుగుతుండే వ్యవహారమే కనుక ఆ ఊరి వారందరూ దానికి అలవాటు పడిపోయారు.

అదృష్టవశాత్తూ సావిత్రి బస్ దిగేవాళ్ళ వర్గంలో ఉంది కాబట్టి ఆమెని తప్పనిసరిగా దించింది బస్.

బస్ దిగడమైతే బాగానే జరిగింది కాని, ఆ నిశీథిలో ఒంటరిగా ఆ నిర్జన ప్రదేశంలో జుట్టు విరబోసుకున్న బ్రహ్మరాక్షసి వంటి ఆ చింతచెట్టు క్రింద నిలబడేసరికి - ఆమెకి భయంతో ఒళ్ళు కంపించిపోయింది. దానికితోడు - చల్లని ఈదురుగాలి వంటిని మరింత వణికిస్తోంది. ఆ సమయంలో మసక వెన్నెల - చెట్లకి రకరకాల ఆకారాల్ని కల్పిస్తూ ఆహ్లాదానికి బదులు భయాన్ని కల్పిస్తోంది.

అక్కడ నుంచి మైలు దూరం నడిస్తేనే కానీ ఊరు రాదు. ఊళ్లోకి తిరిగివెళ్ళే ఏ ఎడ్లబండి కూడా కనిపించడం లేదు. పిచ్చికానీ, రాత్రి పది గంటలకి ఏ బండి వస్తుంది? ఆ సమయంలో అందరూ ఆదమరచి నిద్రపోతుంటారు. అందులోనూ అది పల్లెటూరు. ఏ పట్నమో అయితే

కాస్తో కూస్తో సందడి ఉండేది.

సావిత్రి బస్ ఐదు గంటలకే ఎక్కింది. మామూలుగా అయితే ఆరు అయ్యేసరికల్లా బస్ దిగగలిగేది. చీకటి పడకుండా ఊరు చేరుకుని ఉండేది. కానీ ఆ ముదనష్టం బస్ దారిలో చెడిపోయింది. అటు నుంచి వచ్చే వేరే బస్‌లు కూడా లేవు. ఏదో లారీ వస్తుంటే దానిని ఆపి, కండక్టర్ పట్నం వెళ్లి, తొమ్మిది దాటాక మరో బస్‌తో తిరిగివచ్చాడు. ఇదంతా అయ్యేసరికి ఈ సమయం అయింది.

సావిత్రికి తన పిల్లలెలా ఉన్నారో, ఎంత భయపడుతున్నారోనని ఆందోళన ఎక్కువైంది. ఐదేళ్ల కూతుర్ని, రెండేళ్ల బాబునీ ప్రక్కవాళ్ళింట్లో వదిలివచ్చింది. భర్తకి కడుపులో గడ్డలేస్తే పట్నంలో హాస్పిటల్‌లో చేర్పించింది. ఆపరేషన్ అయి వారం రోజులయింది.



మరో రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తారు.

చెట్టు మీద ఏమి అలికిడి అయిందో, ఏమో – కబోది పక్షులు కీచుకీచుమంటూ అరుపులు మొదలెట్టాయి. ఆ అరుపులకి గబ్బిలాలు లేచి రెక్కలు రెపరెపలాడిస్తూ తిరగసాగాయి.

సావిత్రికి భయంతో ముచ్చెమటలు పోశాయి.

ఇంక అక్కడ ఉండలేకపోయింది. ఉండి చేయగలిగిందీ లేదు. అది ఆ సమయంలో ఉండవలసిన ప్రదేశం అంతకన్నా కాదు. కానీ ఎలా వెళ్లడం? అక్కడి నుంచి ఊళ్లోకి పోయే దారి అంతా కచ్చా కచ్చాగా ఉంటుంది. ఏ పురుగైనా, పుట్రయినా ఆ డొంకలో కాటేస్తే? పైగా కొంతదూరం తాటితోపులో నడవాలి.

ఆ తోపులోంచి పగటిపూట వెళ్లడానికే భయంవేస్తుంది. అటువంటిది ఈ మసక వెలుతురులో ఎలా వెళ్లడం? దారిలో ఏమైనా కాటేస్తే? దిక్కు కూడా ఎవరూ ఉండరు. భయంతో ప్రాణం పోతే? తన పిల్లల గతేం కాను? తన భర్త గతేం కాను?

– భయాందోళనతో, ఆలోచనలతో సావిత్రి మనసు అల్లకల్లోలం అయిపోతోంది. ఏడుపు వచ్చేస్తోంది. బిగ్గరగా ఏడవాలని ఉంది. కానీ ఏడ్చే ధైర్యం లేక ఉగ్గబట్టడంతో గొంతు పూడిపోయింది.

దైవం మీద భారం వేసి బయలుదేరింది సావిత్రి.

ఆమె మనస్సులోనైతే రెక్కలు కట్టుకుని ఇంట్లో వాలాలని ఉంది. కానీ భయంతో కాళ్లు ముందుకు సాగడం లేదు. అలాగే తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో కాళ్లని ఈడ్చుకుంటూ బయలుదేరింది.

సావిత్రి తాటితోపులోంచి వెళ్తోంది. కాలిబాట స్పష్టంగానే కనిపిస్తోంది. కానీ చుట్టూ పొడుగ్గా ఎదిగిన చెట్లను చూస్తుంటే, మధ్య మధ్య వాటి మీద పక్షులు చేసే రొద వింటుంటే... గుండె గుభిల్లుమంటోంది. అలసటతో, ఆందోళనతో ఓపిక క్షీణించింది. అయినా మనోబలంతో శక్తిని పుంజుకుని, సాధ్యమైనంత వడిగా నడుస్తోంది.

సగం దూరం వెళ్లేసరికి ముందు ఏదో ఆకారం అస్పష్టంగా కనిపించింది.

దానిని చూడగానే గుండె ఝల్లుమంది సావిత్రికి.

## పాతబంగారం

తెలుగు కథల గురించి, కథారచయితల గురించీ చెప్పుకొంటూంటే అందులో ప్రముఖంగా వినిపించే పేరు 'డా॥ కె. ఆర్. కె. మోహన్'. *300* పైగా కథలను రచించిన ఈయన కథలు అతిసామాన్య విషయంతో సామాన్య పాఠకుడి హృదయానికి హత్తుకొనేలా ఉంటాయని చెప్పడం అతిశయోక్తి కాదు. సాధారణ జీవితంలో జరిగే చిన్న చిన్న సంఘటనలు సమాజంపై ఎంత తీవ్ర ప్రభావం చూపుతాయో వివరించడంలో శ్రీ మోహన్‌కి ఆయనేసాటి.

*1979*లో 'నీలిమ' మాసపత్రికలో ప్రచురించబడిన ఈ 'ఒక ఊరి కథ' పత్రికల బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నిస్తూ ఎక్కుపెట్టిన కథ. అప్పుడే కాదు... ఇప్పుడూ... ఈ ఎలక్ట్రానిక్ మీడియా యుగంలోనూ అందరూ ఆలోచించవలసిన విషయం ఇది.

కథలు, నవలలు, కవితలు, వ్యాసాలు... వంటి దాదాపు *5,000*కు పైగా రచనలు చేసిన శ్రీ మోహన్ గత మే నెలలో స్వర్గస్తులయ్యారు.

పిల్లిలాగా అడుగులు నెమ్మదిగా వేయ సాగింది. కొంచెం ముందుకు వెళ్లేసరికి ఆ నడుస్తున్న ఆకారం మామూలుగా నడుస్తున్నట్లు అనిపించలేదు. తూలుతూ తప్పటడుగులు వేస్తోంది. సందేహం లేదు - ఎవడో త్రాగుబోతు చిత్తుగా త్రాగి తూలుతూ పోతున్నాడు.

'చచ్చాం... వీడి కంటబడితే ఇంకేమైనా ఉందా?' అనుకుంది సావిత్రి.

త్వరత్వరగా నడిస్తే వాడి ముందునుంచే వెళ్లాలి. ఆ ప్రమాదం తెచ్చుకోవడం ఇష్టంలేక, తప్పనిసరిగా, గత్యంతరం లేక వాడి వెనకనే కొంచెం దూరంలో నెమ్మదిగా నడవసాగింది.

'అసలే ఆలస్యమై కంగారుపడుతుంటే ఈ పీడాకారం ఏమిట్రా బాబూ!' అని తనలో తానే విసుక్కోసాగింది. ఆ తాటితోపు దాటితేనే కానీ ఆ పీడ వదలదు.

మరికొంచెం ముందుకెళ్లేసరికి ఆ వ్యక్తి ఉమ్మేసుకోడానికో, మరెందుకో గానీ వెనక్కి తిరిగాడు. ఆ మసక వెన్నెట్లో సావిత్రి అతని కంట పడనే పడింది. పరకాయించి చూస్తూ "యారది?" అని అరిచాడు.

సావిత్రికి గుండె ఎగిరి గొంతులో పడి నట్లయింది!

అడుగు ముందుకు పడకుండా అక్కడే కొయ్యబారిపోయింది. కాళ్లు వణికిపోసాగాయి. గుండెలు పగిలిపోతాయేమోనన్నట్లుగా కొట్టు కుంటున్నాయి. బిగ్గరగా కేకవేద్దామన్నా గొంతు పెగలడం లేదు.

"యారదంటే మాటాడరేం...?" అంటూ దగ్గరికి వచ్చింది ఆ ఆకారం.

సుడిగాలికి రెపరెపలాడే తమలపాకులాగా విలవిలలాడిపోయింది సావిత్రి. అధఃపాతాళం లోకి కృంగిపోతున్నట్లుగా అన్పించసాగింది.

ఆ వ్యక్తి దగ్గరికి వచ్చి పరకాయించి చూసి, "పిల్ల! ఎవరూ పిల్లా నువ్వు?" అని బరువైన గొంతుతో అడిగాడు. మనిషి దగ్గరికి వస్తుంటేనే కొట్టిన కల్లు కంపు - నోరు విప్పగానే గుప్పు మంది.

సావిత్రి ఏమీ మాట్లాడలేదు. బెదురుచూపు లు చూస్తూ ఉండిపోయింది. ఆనాటితో తన మానప్రాణాలకి చెల్లు అనుకుంది. ఆ వ్యక్తిని పరకాయించి చూసింది. వాడెవడో కాదు - మోతుబరి రంగారెడ్డిగారి దగ్గర పాలేరు పని చేసే పోచయ్య.

"పోచయ్యా! నేను - ప్రకాశం పంతులు గారి భార్యని!" అంటూ అతికష్టం మీద పలికిం ది. కానీ ఆ స్వరం దిగుడు బావిలోంచి వచ్చి నంత హీనంగా ఉంది. ఆమె చెవులకే వినిపిం చాయో లేదో అనుమానం!

ఆమె చెవులకే వినిపించని మాటలు - త్రాగుడు మైకంలో ఉన్న పోచయ్య చెవులకి వినిపించి ఉంటాయనే నమ్మకం లేదు. వినిపిం చినా మెదడులోకి ప్రవేశించే అవకాశం లేదు.

"ఏం పిల్లా! పలకరిస్తే మాట్లాడవు?" అం టూ మోటుగా సావిత్రి చెయ్యి పుచ్చుకున్నాడు పోచయ్య.

పులి నోట్లో మేకపిల్ల లాగ గిజగిజలాడి పోయింది సావిత్రి. అతి కష్టం మీద గొంతు పెగల్చి అరిచింది. అదీ... హీనస్వరమే!

చేతిని పట్టుకోవడంతో పోచయ్య ఆగలేదు. అతని రెండు చేతులూ ఉక్కుచట్రాలు లాగా సావిత్రి నడుముని చుట్టేశాయి. ఆ ఇనప వల యం అంతకంతకీ బిగిసిపోతోంది. సావిత్రి గిలగిలా కొట్టుకుంటున్న కొద్దీ మరింత చిన్నదై పోచయ్యకి హత్తుకుపోయేటంతగా అయిపో యింది.

పులి మేకపిల్ల మెడ కొరికేసింది. చీడపురుగు గులాబీ పువ్వుని కొరికేసింది. పంచభూతాల సాక్షిగా పరమ అన్యాయం జరిగిపోయింది.

పది నిమిషాలు గడిచాయి.

పైబట్ట దులుపుకుంటూ, పంచె సవరించుకుంటూ, ఏమీ ఎరగనట్లు ముందుకి సాగిపోయాడు పోచయ్య.

అచేతనంగా నేలపై పడిఉంది సావిత్రి. కొంచెంసేపటికి తేరుకుని, మూర్తీభవించిన శోకదేవతలాగా ముందుకి సాగింది. ఆ భీకర కాళరాత్రిలో గొంతు విప్పి గట్టిగా ఏడ్చే ధైర్యం కూడా లేదు ఆమెకి. దుఃఖాన్నంతా గుండెల్లోనే గూడుకట్టుకుని ఇల్లు చేరింది.

ప్రక్కింటి రామశాస్త్రిగారు గుమ్మం దగ్గరే ఉన్నారు. ఆమె ఇంకా రాలేదనే ఆత్రంతో ఆమె కోసం అక్కడే ఎదురుచూస్తూండిపోయారు.

ఆయన ముఖం వంక చూడలేక తల దించుకుంది సావిత్రి.

"ఏమమ్మా! ఇంత ఆలస్యం అయింది? ప్రకాశం బాగున్నాడు కదా? మీ పిల్లలు ఇంతసేపూ నీకోసం ఎదురుచూసి ఇప్పుడే నిద్రపోయారు" అంటూ చెప్పుకుపోయాడు ఆయన.

ఇంక సావిత్రికి దుఃఖం ఆగలేదు. ముఖాన గుడ్డ వేసుకుని వెక్కివెక్కి ఏడవసాగింది.

రామశాస్త్రిగారు "ఏమైందమ్మా? ప్రకాశం కులాసాయే కదా!" అంటూ కంగారుగా అడిగారు.

"కులాసాయే బాబాయిగారూ! కానీ, కానీ..." అంటూ చెప్పలేక చెప్పలేక జరిగింది చెప్పి భోరుమంది.

"అయ్యో... దుర్మార్గుడు ఎంత పనిచేశాడు? నువ్వు ముందు స్నానం చేసి కాస్త ఎంగిలిపడు తల్లీ! మిగిలిన సంగతులు ప్రొద్దున చూసుకుందాం!" అంటూ ఓదార్చాడు ఆయన.

సావిత్రి దుఃఖాన్ని ఆపుకుంటూ, పెరటిలో నూతివైపు సాగింది. స్నానం చేసి వచ్చి "బాబాయిగారూ! నాకేమీ తినాలని లేదు. ఈ రాత్రప్పుడు పిల్లల్ని లేపడం ఎందుకు? నేను పోయి మా ఇంట్లోనే పడుకుంటాను. తాళం చెవి ఇయ్యండి!" అంది.

భోజనం చేయమని బలవంతపెట్టినా ఆమె వినకపోవడంతో చేసేదిలేక తాళం చెవి తెచ్చి ఇచ్చాడాయన.

అర్ధరాత్రి రెండుగంటలు దాటింది.

సావిత్రికి తన వంటిమీద తనకే అసహ్యం వేస్తోంది. పాము కుబుసం విడిచేసినట్లు దేహాన్ని విడిచేయాలని ఉంది.

తెల్లవారితే నలుగురికీ ముఖం చూపించేది ఎలా?


తన భర్తకి ఏమని చెప్పగలదు?

ఈ రహస్యాన్ని తనలోనే ఇముడ్చుకోవచ్చు. రామశాస్త్రిగారు కూడా ఎవరికీ చెప్పరు. కానీ ఈ కళంకం నిత్యమూ తనని వెక్కిరిస్తూంటే భరించేది ఎలా?

అభిమానవతియైన సావిత్రి ఇంక తట్టుకోలేకపోయింది. నెమ్మదిగా తలుపులు తీసుకొని వీధిలోకి వచ్చింది. బయట గొళ్ళెం పెట్టి ఊరి చెరువువైపు సాగిపోయింది.

చెరువు గట్టుపైన నిలబడి నలువైపులా చూసింది. ఊరంతా ఆదమరిచి నిద్రపోతోంది. 'హు... ఈ చీకటి తెరమాటున తెలియకుండా ఎన్ని ఘోరాలు జరుగుతున్నాయో?!' అనుకుంది.

చివరిసారిగా భగవంతుడిని, భర్తని, పిల్లల్నీ




తలచుకొని చెరువులో దూకేసింది. గంగమ్మ తల్లి ఒడిలో శాశ్వత నిద్రపోయింది.

మర్నాడు సావిత్రి ఆత్మహత్య విషయం గ్రామమంతా గుప్పుమంది అది విని రామశాస్త్రి గారు మ్రాన్పడిపోయారు. ఇలా జరుగుతుందని ఆయన ఊహించలేదు. ఆమె మృతికి తన అజాగ్రత్తే కారణమన్నట్లు బాధపడసాగారు.

ఆయన ఇంటివద్ద వాడలోని వారంతా – పెద్దలూ, పిల్లలూ, యువకులూ, స్త్రీలూ అందరూ చేరారు. సావిత్రి పిల్లల దుఃఖం చూస్తుంటే అందరికీ కడుపు తరుక్కుపోయింది. అయితే సావిత్రి ఎందుకు ఆత్మహత్య చేసుకుందో, ఆమె మృతికి ఎవరు కారణమో ఎవరికీ తెలీదు.

ఆ సమయానికి – అటువైపు ఏమీ ఎరగనట్లు పోచయ్య వస్తున్నాడు. నిజానికి త్రాగుడు మైకంలో తానెవర్ని చెరిచిందీ వాడికీ తెలిసి ఉండకపోవచ్చు.

పోచయ్యని చూడగానే రామశాస్త్రిగారి నెత్తురు ఉద్రేకంతో ఉడికిపోయింది...

"వీడే... ఈ నీచుడే సావిత్రిని చంపింది! ఒంటరిగా వస్తున్న ఆమెని ఈ దౌర్భాగ్యుడే చెరిచాడు. ఆ అవమానం భరించలేక ఆ ఇల్లాలు ఆత్మహత్య చేసుకుంది!" అన్నాడు ఆవేశంగా.

అంతే! అక్కడ గుమిగూడిన వారిలో ఆవేశం పరవళ్ళు తొక్కింది.

యువకులు వరదగోదావరిలాగా విరుచుకుపడ్డారు. పోచయ్యని పట్టుకుని పిచ్చికుక్కని కొట్టినట్లు కొట్టారు.

"అమ్మో... అయ్యో..." అని అనవలసిన అవసరం లేనంత త్వరలోనే పోచయ్య ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎప్పుడైతే పోచయ్య మరణించాడో – ఎక్కడి వారక్కడికి జారుకున్నారు.

మర్నాటి పేపర్లలో పోచయ్య మరణవార్త ప్రముఖంగా ప్రచురించబడింది.

'హరిజనుడి హత్య' అని దాని శీర్షిక. ఒక

స్త్రీని చెరిచాడనే అనుమానంపై అగ్రవర్ణాల వారు దొమ్మీ చేసి, అసహాయుడు, బలహీనుడైన హరిజనుని హత్యచేశారని ఆ వార్త సారాంశం.

అసలే జరిగిన సంఘటన ఊరిలో కావలసినంత ఉద్రేకాన్ని కల్పించింది. దీనికితోడు పేపర్లలో వచ్చిన వార్త అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. ఆ వార్త చదివిన వారికి – పోచయ్య హరిజనుడైనందువల్లే అగ్రవర్ణాల వారు చంపినట్లు అర్థాన్ని స్ఫురింపజేసింది. ఆ వార్తలో అసలు కారణం మరుగున పడిపోయింది.

తమాషా ఏమిటంటే... అదే రోజు పత్రికల్లో మరో వార్త ఉంది. దగ్గర్లో ఉన్న మరో గ్రామంలో ఒక ఉన్నత కులం వారి యువకుడు ఒక హరిజన యువతిపై అత్యాచారం చేయబోగా – గూడెంలోని హరిజనులు వచ్చి అతన్ని పట్టుకుకొట్టారు. ఆ దెబ్బలకి అతను చచ్చాడు.

కానీ ఆ వార్తకి శీర్షిక – 'మదోన్మత్తునికి తగిన శాస్తి!' అని పెట్టారు.

తన స్థానబలిమితో బలహీనురాలైన హరిజన యువతిపై అత్యాచారం జరుపబోయినందుకు హరిజనులు కొట్టినట్లు, ఆ సంఘటనలో అతను మరణించినట్లు... ఆ వార్త సారాంశం.

రెండు సంఘటనల్లోనూ విషయం ఒక్కటే! కానీ వార్త చిత్రీకరణలో ఎంతటి వైరుధ్యం?

బాధ్యత గల పత్రికలు వార్తలను ఇలాగేనా ప్రచురించాల్సింది? ఏ ప్రయోజనం ఆశించి ఈ విధంగా చిత్రిస్తున్నారు? తప్పు చేసినవాడు హరిజనుడు కావచ్చు, బ్రాహ్మణుడు కావచ్చు. ఆ తప్పులను బట్టే ప్రజలు ఆవేశంతో చర్యలు తీసుకుంటున్నారు కాని, కులదృష్టితో కాదు కదా? పోలీసులు ఉన్నప్పుడు ఎంతటి దోషిపైనైనా చేయి చేసుకోవడం తప్పే. కానీ ఆవేశంలో వివేకం అన్నిటికంటే ముందు బలి అయిపోతుంది. ఈ వాస్తవాన్ని ప్రక్కన పెట్టి, అనవసరంగా కులప్రసక్తి తెచ్చి, ఆవేశాల్ని మరింత రగల్చడం పత్రికలు చేయవలసిన పనేనా?

ఇవన్నీ నిష్పక్షపాతంగా ఆలోచించేవారి మస్తిష్కాలను వేధించే ప్రశ్నలు! ఏమైతేనేం... ఇది నేటి మన భారత జాతీయ జీవనంలో ఒక భాగం. మన పత్రికా నిర్వహణకొక మచ్చు తునక.

సరే... ఏమైతేనేం – పత్రికలలో వార్తలు వాతావరణాన్ని మరింత కలుషితం చేశాయి. పోచయ్యని చంపినందుకు గూడెంలోని హరిజనులు రాత్రికి రాత్రి గుంపుగా వచ్చి వారికి దగ్గరలో ఉన్న అగ్రవర్ణాల వారి కొంపలకి నిప్పెట్టారు. వారు మాత్రం తక్కువా? మర్నాడు రాత్రి హరిజనుల గుడిసెలను పరశురామ ప్రీతి చేశారు.

పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇటూ అటూ కూడా కొందర్ని అరెస్టు చేశారు, కేసులు పెట్టారు.

అయితేనేం – పోయిన సావిత్రి కాని, పోచయ్య కానీ తిరిగి రాలేదు. మధ్యలో అనవసరంగా ఎందరో అమాయకులు బలి అయిపోయారు.

కొన్నాళ్లకి ఊరిలో తిరిగి ప్రశాంతత ఏర్పడింది. కానీ ఇది ఎన్నాళ్లో ఎవరు చెప్పగలరు?

పత్రికలు కనుక మరింత బాధ్యతతో వ్యవహరించిఉంటే పరిస్థితులింతగా విషమించేవి కావని విజ్ఞుల అభిప్రాయం. కానీ ఈ దేశంలో విజ్ఞుల విన్నపాలు కాని, సలహాలు కానీ ఎవరికి కావాలి? ఇక్కడ విజ్ఞులు వెట్టివాళ్ళతో సమానం.

ఇది ఒక ఊరి కథ.

కానీ నిజానికి ఇది ఈ దేశంలో ఎన్నో ఊర్ల కథ. ఎందరో మూగజీవుల విషాద గాథ!